క్లుప్తంగా

రేపు బాదల్‌గాంలో కార్తీక దీపోత్సవం

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని బాదల్‌గాం గ్రామంలోని ప్రసిద్ధిగాంచిన పంచలింగేశ్వర ఆలయంలో ఈ నెల 11న కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న దర్గా నిర్వాహకులు

మనూరు(నారాయణఖేడ్): మనూరులోని ప్రసిద్ధిగాంచిన షాదుల్లా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు దర్గా నిర్వాహకులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట బెల్లాపూర్ మాజీ సర్పంచ్ డింగంబర్‌రెడ్డి, నాయకులు సంగన్న, సాయిలు, షాదుల్, వెంకట్‌రెడ్డి, విద్యాసాగర్, భూపాల్‌రెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

కల్హేర్(నారాయణఖేడ్): మండల కేంద్రంలో ఈ నెల 7న సంతను ముగించుకొని ఇంటికి వెళ్తున్న మహదేవుపల్లి గ్రామానికి చెందిన కొమ్ముల బాలవ్వ(60) 161వ జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ఆమెను నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మహారాష్ట్ర డెగ్లూర్ వైపు నుంచి జ్ఞానేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ బాలవ్వను ఢీకొట్టినట్లు గుర్తించారు. మృతురాలి కుమారుడు కొమ్ముల రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోనీ హిందూ శ్మశానవాటికను రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్మశానవాటికలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని హామీనిచ్చారు. ఎస్సీ శ్మశానవాటికలో సైతం త్వరలో సుందరీకరణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడాపోటీల్లో పాల్గొన్న కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో 40రోజుల పాటు నిర్వహించనున్న క్రీడాపోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లాపూర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ కాలనీవాసులలో మరింత స్నేహభావాన్ని పెంచేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రేటర్ కమ్యూనిటీ కాలనీవాసులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారని ఆయన వివరించారు.

11న సర్వసభ్య సమావేశం

మనూరు(నారాయణఖేడ్): ఈ నెల 11న మనూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొంగరిజయశ్రీమోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షాజిలోద్దిన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ సంజీవరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మధ్యాహ్నం 2గంటలకు సమావేశానికి హాజరు కావాలన్నారు.



కిన్నెరసాని మొగులయ్యను సన్మానిస్తున్న యువకులు

మొగులయ్యకు ఘన సన్మానం

హత్నూర(సంగారెడ్డి): జానపద కళాకారుడు కిన్నెరసాని మొగులయ్యను హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద హోటల్ యాదగిరి, అతడి స్నేహితులు కలిసి శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురి కోరిక మేరకు మొగిలయ్య కిన్నెరసాని పాటను పాడి అందరినీ ఆకట్టుకున్నారు. దారి వెంబడి వెళ్తూ హోటల్ వద్ద ఆగడంతో ప్రజలు కిన్నెరసాని మొగులయ్యను చూసి ఆత్మీయంగా పలకరించారు.



విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

విహారయాత్ర ఉత్సాహం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక విద్యార్థులు శనివారం హైదరాబాద్‌కు విహారయాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. హైదరాబాద్‌లోని జలవిహార్, ఓషియన్ పార్కు, తదితర ప్రాంతాలను చూపించామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణయ్య తెలిపారు.



మేళ్ల చెరువులో చెత్తచెదారం

మురుగు కంపు.. మేళ్ల చెరువు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మేళ్లచెరువు అపరిశుభ్రతకు కేంద్రంగా మారుతోంది. దీంతో చుట్టుపక్కల నివాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో స్థానికులే స్వయంగా చెరువు పరిసరాలను శుభ్రం చేసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శనివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పలుచోట్ల ఆమె చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అదేవిధంగా ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ సోనియాగాంధీ కృషితోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి మెరుగైన పాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఖేడ్ ఎమ్మెల్యే నివాసంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకులు నిర్వహిస్తున్న నాయకులు



హత్నూర: దౌల్తాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



రామచంద్రాపురం: తెల్లాపూర్ మున్సిపల్ కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



జోగిపేట: కేక్ తినిపించుకుంటున్న నాయకులు, కార్యకర్తలు



పటాన్‌చెరు టౌన్: సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



జిన్నారంలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



జిన్నారం: గుమ్మడిదలలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



జహీరాబాద్: కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

దామోదర, పొన్నంకు సన్మానం

నారాయణఖేడ్: రాష్ట్ర మంత్రులుగా నియమితులైన దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లను హైదరాబాద్‌లోని వారివారి నివాస గృహాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రషీద్ ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న సురేశ్‌షెట్కార్

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దామోదర రాజనర్సింహను రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు అవినాష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్‌సింగ్, నవీన్‌గౌడ్, వేణు, సంతోష్, పవన్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దామోదరను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

సీఎం నిర్ణయం హర్షణీయం

హత్నూర(సంగారెడ్డి): ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఉద్యమకారుల కమిటీ మండల అధ్యక్షుడు మారుతిరాజు అన్నారు. మండల పరిధిలోని దౌల్తాబాద్‌లోని ఎస్‌ఎస్‌ఆర్ గార్డెన్‌లో వివిధ గ్రామాలకు చెందిన మలిదశ ఉద్యమకారులతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతిరాజు మాట్లాడుతూ మండల ఉద్యమకారులందరం ఒక తాటిపైకి రావాలన్నారు. ప్రభుత్వం ఉద్యమకారులకు అందించబోయే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందుకోసం ఉద్యమకారులందరూ ప్రభుత్వం ద్వారా గుర్తింపుపత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు చెన్న నర్సింహులు, పటాన్‌చెరు నరేందర్, నగేష్, మల్లేష్, శంకర్, యాదగిరి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉద్యమకారులు

బీమా చెక్కు అందజేత

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన అవుసుల భాస్కర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన కుమారుడు నరేందర్‌కు రూ.2లక్షల బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శనివారం అందజేశారు. భాస్కర్ బీఆర్‌ఎస్ కార్యకర్త కాగా ఆయనకు పార్టీ సభ్యత్వం ఉండడంతో బీమాతో లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, నిజాంపేట్ సర్పంచ్ జగదీశ్వరాచారి, ఉపసర్పంచ్ రాజీబాయి రాంచందర్, వార్డుసభ్యులు నర్సింహులు, రజాక్, యాదగిరి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పరామర్శ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ రాజుకుమార్ సిగ్రె తండ్రి రిటైర్డు పోలీస్ అధికారి గోవింద్‌రావు పాటిల్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట తెలంగాణ జాగృతి జిల్లా యువత అధ్యక్షుడు అరుణ్‌రాజు శెరికార్, సర్పంచ్ రవీందర్‌రావు, నాయకులు నర్సగౌడ్, సందీప్‌సేట్ ఉన్నారు.

బస్‌డిపో ఏర్పాటు చేయాలి

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో బస్‌డిపో, ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రామచందర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో రామాయంపేటకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుపై చర్యలు తీసుకున్నారన్నారు. రామాయంపేట బస్టాండ్‌కు గతంలో పలు డిపోలకు చెందిన 500 బస్సులు వచ్చేవని, ఇప్పుడు 50 బస్సులు కూడా పట్టణానికి రావడంలేదన్నారు. బస్సు వసతి లేక పట్టణ ప్రజలు నానా అవస్థలుపడుతున్నారన్నారు. చాలా బస్సులు పట్టణంలోకి రాకుండా నేరుగా జాతీయ రహదారిపై నుంచే వెళ్లిపోతున్నాయన్నారు. రామాయంపేటలో బస్‌డిపో ఏర్పాటుకు గతంలో స్థలం కేటాయించడం జరిగిందన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని రంగనాయకస్వామి దేవాలయంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి ఎదుల్లాపూర్ గ్రామంలో గ్రామ దేవతల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం సర్పంచ్ కీర్తన ఆధ్వర్యంలో దేవతలకు పూజలు నిర్వహించారు. ఈనెల 11వ తేదీ వరకు గ్రామంలో జరుగుతాయని సర్పంచ్ తెలిపారు. ఎంపీపీ హరికృష్ణ, ఉపసర్పంచ్ పాండురంగం తదితరులు ఉన్నారు.

బాలాజీకి డాక్టరేట్

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి మద్దూరు మండలం బెక్కల్ గ్రామ పరిధిలోని శివాలి తండాకు చెందిన లకావత్ బాలాజీ డాక్టరేట్ పొందారు. తండాలోని నిరుపేద కుటుంబానికి చెందిన బాలాజీ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాకతీయ యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రం ప్రొఫెసర్ గుగులోత్ వీరన్న ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల పనితీరు– జనగామ జిల్లా యొక్క పరిశీలన' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. శనివారం కేయూ నుంచి డాక్టరేట్‌ను స్వీకరించాడు. ఈసందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు, అభినందించారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారంటే చేసి తీరుతారని మరోసారి నిరూపించారన్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పటాన్‌చెరు మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ ముదిరాజ్, జిల్లా నాయకులు మదాస్ రాజశేఖర్, నాయకులు దీపక్‌గౌడ్, అనిల్‌గౌడ్ నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు ఉచిత బస్‌టికెట్ అందజేస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

వైభవంగా మహా పడిపూజ

నర్సాపూర్ రూరల్: మండలంలోని మాడాపూర్‌లో శనివారం అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామమంతా మారుమోగింది. మహాపడిపూజలో గురుస్వామి నరసింహ గౌడ్, స్వాములు రాము, నర్సాపూర్ జెడ్పీటీసీ బాబ్యానాయక్, సర్పంచ్ ఉమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాడాపూర్‌లో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

బాల్యమిత్రుడికి చేయూత

కౌడిపల్లి(నర్సాపూర్): అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి స్నేహితులు అండగా నిలిచారు. ఆర్థిక సహాయం అందించి తామున్నామంటూ భరోసా కల్పించారు. మండల కేంద్రమైన కౌడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహితుడు శంకర్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు అతడిని పరామర్శించి, రూ.76 వేల నగదును చికిత్స కోసం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, ఆంజనేయులు, లక్ష్మణ్, రాయగిరి, రవిగౌడ్ సత్యం, రాజుగౌడ్ భిక్షపతి దూద్యనాయక్, పాండు నాయక్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీలో అనుమతి లేని ఇళ్లను అధికారులు కూల్చివేసిన ఘటనలో ఎమ్మెల్యే సునీతారెడ్డికి ఎలాంటి సంబంధం లేదని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, కౌన్సిలర్ అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యనారాయణగౌడ్, భిక్షపతి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను తహసీల్దార్ కమలాద్రి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టారని, అయితే ఎమ్మెల్యే సునీతారెడ్డి కూల్చి వేయించారని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు తమ విధుల్లో భాగంగా అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారన్నారు. కాగా ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో మురళీయాదవ్ ఓడిపోవడంతో పాటు నర్సాపూర్‌లో ఆయనకు తక్కువ ఓట్లు రావడంతో కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. మురళీయాదవ్ టీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లాడని, తన చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండు చేశారు. మురళీయాదవ్ అవినీతికి పాల్పడంతో తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. కాగా పట్టణంలో పలు ప్రభుత్వ భవనాలు కూల్చగా వచ్చిన స్క్రాప్ అమ్మకంలో చైర్మన్ అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

ప్రభుత్వ అధికారులు ప్రొటోకాల్ పాటించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి ఫ్రీ బస్ స్కీం పథకం ప్రారంభ కార్యక్రమానికి ఆర్టీసీ అధికారులు ఎమ్మెల్యే సునీతారెడ్డిని ఆహ్వానించకపోవడం విచారకరమన్నారు. అధికారులు ఇకపై ప్రొటోకాల్ పాటించాలని, లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో అధికారులకు వ్యతిరేకంగా ముందుకు సాగాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నయీమొద్దీన్, అశోక్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, భిక్షపతి, నగేష్, దావూద్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీతారెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

హత్నూర(సంగారెడ్డి): ఎమ్మెల్యేగా సునీతాలక్ష్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ఎంపీపీ వావిలాల నర్సింహులు ఆధ్వర్యంలో పలువురు నాయకులు శనివారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యువత మండల అధ్యక్షుడు తుమ్మలపల్లి కిషోర్, నాయకులు సాజిద్‌బాయ్, అమ్రది జగదీష్, వాయిలాల కృష్ణ, సాయి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.